సాక్షి ఆదిలాబాద్

బుధవారం ၊ 15 ၊ ఫిబ్రవరి ၊ 2023



రిమ్స్‌లో ఎన్‌ఎంసీ బృందం తనిఖీ

రిమ్స్‌లో పీజీ సీట్ల మంజూరు నిమిత్తం నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) బృందం మంగళవారం తనిఖీ చేసింది. అన్ని వార్డులను పరిశీలించారు. 10లో▸



ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఉన్న వరుణ్‌రెడ్డి ఇటీవల బదిలీపై నిర్మల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు కొత్త పీవోగా ఎవరు నియమితులవుతారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0/13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళలో చలి తీవ్రతతో పాటు వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. పగటిపూట ఉక్కపోత ఉండనుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా కంటి వెలుగు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

నేరడిగొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. కిష్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. నేత్ర సమస్యలు ఉన్నవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, కంటి వైద్యులు స్వప్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి

ఆదిలాబాద్‌టౌన్: కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దర్శనాల మల్లేశ్ అన్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా పట్టణంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో కులాంతర వివాహం చేసుకున్న పలువురిని మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల నిర్మూలన జరగాలంటే కులాంతర వివాహాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్, యూటీఎఫ్, సీపీఎం నాయకులు వెంకట్, దత్తాత్రి, ఆశన్న, సచిన్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ఈ నెల 16న మహిళలకు జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం ఉదయం 10:30 గంటలకు ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన వారిని ఈ నెల 17న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలచిన వారు బుధవారం సాయంత్రం ఐదు గంటలలోపు ఐపీ స్టేడియంలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 95054 80464, 94907 40567 నంబర్లలోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

బోథ్: యువత సన్మార్గంలో నడవాలని జెడ్పీ వైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని లాలపిచ్‌లో ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఇందులో జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు అభిలాష్, హరీష్, నందు పాల్గొన్నారు.

రెవెన్యూ విభాగం అర్జీలే అధికం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పురప్రజావాణికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 47 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 30 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ 8, టౌన్ ప్లానింగ్ 6, అడ్మినిస్ట్రేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్, శానిటేషన్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున 47 అర్జీలు అందాయి. రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణనాయక్, డీఈ యూనుస్ అర్జీలు స్వీకరించారు. మున్సిపల్ మేనేజర్ దివాకర్, ఉద్యోగులు భాగ్యలక్ష్మి, పెంటాజీ, రవీందర్ పాల్గొన్నారు.

హోంగార్డు సస్పెన్షన్

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి జర్నలిస్టుపై దాడి చేసిన ఘటనలో హోంగార్డును సస్పెండ్ చేసినట్లు ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఇచ్చోడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుపై దాడికి పాల్పడిన హోంగార్డు విజయ్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ముగిసిన బదిలీల దరఖాస్తు గడువు

ఆదిలాబాద్‌టౌన్: జీవో 317కు సంబంధించిన ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. ఈనెల 12 నుంచి 14 వరకు వీరికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈమేరకు జిల్లాలో జీవో 317 ద్వారా బదిలీపై వచ్చిన వారు 238 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే జిల్లాలో బదిలీల కోసం 1,605 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. కొత్తగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వివరాలను ఎంఈవోలు డీఈవో కార్యాలయంలో బుధవారం సమర్పించనున్నారు.

ఆగని ఆక్రమణలు!



ఆదిలాబాద్ పట్టణం వికలాంగుల కాలనీని ఆనుకుని, మావల శివారు పరిధిలోని సర్వేనం.346లో 200.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. ఇందులో జిల్లా ఉన్నతాధికారుల నివాసాలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల కోసం 1992లో 134.30 ఎకరాలు కేటాయించారు. అధికారిక లెక్కల ప్రకారం మిగతా 66 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండాల్సి ఉంది. కానీ ఏళ్లుగా ఆ భూమిని అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ హస్తగతం చేసుకున్నారు. క్రయవిక్రయాల ద్వారా ఈ భూమి ఒకరి నుంచి మరొకరికి ఇప్పటివరకు ఐదుగురి చేతులు మారింది. భూమిని సంరక్షించాల్సిన సంబంధిత శాఖ కిందిస్థాయి అధికారులు అక్రమార్కులకు వంతపాడుతూ సంబంధిత రికార్డులనే మాయం చేసినట్లు ఆరోపణలున్నాయి.

- జిల్లా కేంద్రంలో జోరుగా భూదందా
- 66 ఎకరాల సర్కారు భూమి రికార్డులు మాయం
- అసైన్డ్ భూముల్లోనూ అక్రమ నిర్మాణాలు
- వంతపాడుతున్న కింది స్థాయి అధికారులు
- ప్రేక్షకపాత్రలో ఉన్నతాధికారులు



ఇక్కడ కనిపిస్తున్న నిర్మాణాలు చూసి ఇదేదో రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలనుకుంటే పొరపాటే. ఇవన్నీ అక్రమ నిర్మాణాలే. మావల మండలం, పట్టణ పరిధిలోని దస్నాపూర్ శివారు సర్వే నం.21లో గల అసైన్డ్ భూమిపై కన్నేసిన కొంతమంది అక్రమార్కులు దీనిని ఆక్రమించేశారు. ప్లాట్లుగా విభజించి అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా ఇలా అక్రమ నిర్మాణాలకు తెర లేపారు. మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లను పొందే ఎత్తుగడలో భాగంగా ఒకసారి ఇలా చిన్నపాటిగా 30 ఇళ్ల నిర్మాణాలను ఏకకాలంలో ప్రారంభించారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నా అటు రెవెన్యూ కానీ ఇటు మున్సిపల్ అధికారులు కానీ కన్నెత్తి చూడటం లేదు.

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఏ విధంగా అక్రమార్కుల పరమవుతున్నాయనేందుకు ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు, భూ బకాసురులు వాటిపై గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఏదైనా కానీ వారి కన్నుపడిందంటే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. భూములను సంరక్షించాల్సిన ఆయా శాఖల్లోని కింది స్థాయి అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండడంతో ఈ దందా వారికి మూడు ప్లాట్లు .. ఆరు ఇండ్లు అన్న చందంగా సాగుతోంది. ఉన్నతాధికారులు సైతం ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం అక్రమార్కులకు కలిసివస్తుండగా, ప్రభుత్వ స్థలాలు చూస్తుండగానే ప్రైవేట్ వ్యక్తుల్లోకి చేరిపోతున్నాయి.

భూ రికార్డుల 'మాయ'ం

సర్వేనంబర్ 346లో గల 200 ఎకరాల భూమిలో 134.30 గుంటల భూమిని ప్రభుత్వం 1992లో వివిధ అవసరాల కోసం కేటాయింపులు చేసింది. మరో 66 ఎకరాల భూమి మిగిలింది. ఇది ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి. ఆ భూమికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన భూ రికార్డులు సైతం సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి. కానీ ఆ భూమి ప్రభుత్వానిదంటూ తెలిపే రికార్డులేమి అధికారుల వద్ద లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆయా శాఖల్లో పనిచేసే కొంతమంది కింది స్థాయి ఉద్యోగులు అక్రమార్కులతో కుమ్మక్కై వాటిని మాయం చేశారనే చర్చ సాగుతుంది. రికార్డులేమి అధికారుల వద్ద లేవనే విషయం తెలుసుకున్న భూ బకాసురులు వాటికి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి పట్టాలు సైతం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని వాటిని కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు. ఈవిషయంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. శాఖాపరంగా సమగ్ర విచారణ జరిపితే అక్రమార్కులతో అంటకాగిన బాధ్యులేవరనే విషయం తెలుస్తుందని ఆదిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అసైన్డ్ భూమిని ఆక్రమించేశారు

ఇటీవల పట్టణంలో విలీనమైన దుర్గానగర్‌లో స్థలాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ప్లాట్ ధర రూ.15లక్షల నుంచి రూ.35లక్షలు పలుకుతుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు దుర్గానగర్‌ను ఆనుకుని ఉన్న అసైన్డ్ భూమిపై కన్నేశారు. ఇంకేముంది దాన్ని తమ హస్తగతం చేసుకోవాలనే ఉద్దేశంతో ప్లాట్లుగా విభజించారు. పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన మాదిరిగా 30 ఇళ్ల నిర్మాణాలను గుట్టు చప్పుడు కాకుండా ఒకే సారి చేపట్టారు. నిర్మాణాలు ఉన్నట్లైతే మున్సిపల్ నుంచి ఇంటి పన్ను కోసం నంబర్లు తీసుకుని తద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే ఎత్తుగడలో భాగంగా ఇలా చిన్న పాటి నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్న అటు రెవెన్యూ, ఇటు మున్సిపల్ యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇందులో రియల్ ఎస్టేట్‌తో పాటు రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తులుండటంతోనే దానిపై చర్యలకు వెనుకాడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా కొత్త కలెక్టర్ స్పందించి భూ ఆక్రమణలపై చర్య తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతుంది.

నిర్మాణాలను ఆపేశాం

దుర్గానగర్‌లోని అసైన్డ్‌భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. వాటిని నిలిపివేసేలా చూడాలంటూ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలను ఆపివేశాం. వాటిని కొనసాగిస్తే మాత్రం తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం. సర్వే నంబర్ 346కు సంబంధించిన విషయమైతే నా దృష్టికి రాలేదు. దీనిపై ఆర్డీవోను విచారించి తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– రిజ్వాన్ బాషా షేక్, అడిషనల్ కలెక్టర్

'కలెక్టరేట్'కు కేటాయించిన భూముల వివరాలివ్వండి



కలెక్టరేట్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌రూరల్: నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం కేటాయించిన భూముల సమాచారాన్ని అందజేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మావల మండల పరిధిలోని వివిధ సర్వేనంబర్లలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కేటాయించిన స్థల విస్తీర్ణం, ప్రైవేట్ పట్టా, ప్రభుత్వ భూమి ఎంత అనే వివరాలను తహసీల్దార్ వనజారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులు, లేఅవుట్ మ్యాపులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ హన్మంత్ రావు, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక తరగతులు, సిలబస్ విషయాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, ప్రధానోపాధ్యాయుడు బిక్కు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రాత్రి గజ గజ.. పగలు ఉక్కపోత

- జిల్లాలో భిన్న వాతావరణం
- అర్లి(టి)లో 7.6 డిగ్రీలుగా నమోదు

జిల్లాలో పలుచోట్ల సోమవారం రాత్రి నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ప్రదేశం(మండలం)	కనిష్ఠ ఉష్ణోగ్రత
అర్లి(టి)	7.6
బజార్‌హత్నూర్	7.8
జైనథ్	8.5
బేల	8.6
సోనాల	9.1
భోరజ్	9.3
ఇచ్చోడ	9.5



అర్లి(టి) గ్రామ ముఖచిత్రం

తాంసి: జిల్లాలో ఓ వైపు ఎండ.. మరోవైపు చలి తీవ్రతతో భిన్న వాతావరణం కనిపిస్తుంది. రెండు మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మొన్నటి వరకు 15 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవగా ప్రస్తుతం పలుచోట్ల 10 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. సోమవారం రాత్రి భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో 7.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువయ్యాయి. రాత్రి పూట చలి, పగటి పూట మండే ఎండ కారణంగా ఉక్కపోతతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. భిన్న వాతావరణంతో అనారోగ్యం బారిన పడుతున్నారు.



నివాళులర్పిస్తున్న యువజన సంఘం నాయకులు

వీర జవాన్లకు నివాళి

కైలాస్‌నగర్: పుల్వామా ఉగ్ర దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్గిల్ అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేశారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు బాలశంకర్‌కృష్ణ, ఉపాధ్యక్షులు బండారి సతీశ్, అజీజ్ అహ్మద్, గణేశ్, శశికళ తదితరులున్నారు.

'స్ట్రీట్ కార్నర్'పై బీజేపీ

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి
- శక్తి కేంద్రాల వారీగా సమావేశాలు
- బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ.. బీజేపీ పథకాలను వివరిస్తూ
- నిర్వహణపై ఫోకస్ పెంచిన అధిష్టానం
- ఉరుకులు పరుగులు పెడుతున్న 'కమలం' నేతలు

సాక్షి, ఆదిలాబాద్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీఅధిష్టానం క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా బలోపేతంపై దృష్టి సారించింది. శక్తికేంద్రాల వారీగా 3నుంచి 5పోలింగ్ బూత్‌లను సమన్వయం చేస్తూ స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తుంది.ఇందులో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే కేంద్ర ప్రభుత్వ పథకాలతో జరిగే లబ్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మీటింగ్స్ నిర్వహణపై పార్టీఅధిష్టానం జిల్లా, నియోజకవర్గం వారీగా నిశితంగా పరిశీలన చేస్తుండటంతో జిల్లానేతలు ఉరుకులు పరుగులుపెడుతున్నారు.

ఈనెల 25 వరకు..

జిల్లాలోని ఆదిలాబాద్ నియోజకవర్గంలో 281, బోథ్ నియోజకవర్గంలో 301 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటితో పాటు ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని పోలింగ్ బూత్‌లు కూడా జిల్లా పరిధిలోకి వస్తాయి. పార్టీ పరంగా బీజేపీ క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల పటిష్టతపై ఇప్పటికే దృష్టి సారించింది. ఇదిలా ఉంటే 3 నుంచి 5 పోలింగ్ బూత్‌లను కలిపి ఒక శక్తి కేంద్రంగా పార్టీ పరిగణిస్తుంది. జిల్లా మొత్తంగా 295 శక్తి కేంద్రాలు పార్టీ పరంగా ఉన్నాయి. ప్రస్తుతం వాటిలో ఈ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆధ్వర్యంలో వీటి నిర్వహణ కొనసాగుతుంది. ఇదిలా ఉంటే నియోజకవర్గ కన్వీనర్లుగా ఆదిలాబాద్‌కు బోయె విజయ్, బోథ్‌కు సూర్యకాంత్ గిత్తే వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో ప్రతిరోజు నియోజకవర్గం వారీగా సుమారు ఆరు శక్తి కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. ఈనెల 10న ఇవి మొదలు కాగా, 25కు పూర్తి కానున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 70 శక్తి కేంద్రాల సమావేశాలు పూర్తి చేసినట్లు జిల్లా నేతలు స్పష్టం చేస్తున్నారు.

ఉరుకులు పరుగులు..

ప్రతిరోజు ఏయే నియోజకవర్గాల్లో ఏ స్థాయిలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు జరుగుతున్నాయి..? ఆ సభలను ఎవరు నిర్వహిస్తున్నారు..? ఎంత మంది హాజరయ్యారు..? ఎక్కడెక్కడ నిర్వహించలేదు.. అనే విషయాలపై తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ప్రతి రోజూ ఆరా తీస్తుండడంతో నియోజకవర్గాల్లో నేతలు హడావుడిగా వీటి నిర్వహణ కానిచ్చేస్తున్నారు. పార్టీ పరంగా పేపర్‌లో బూత్ కమిటీలు పటిష్ఠంగా కనిపిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం నామమాత్రంగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి. దీంతో స్ట్రీట్ కార్నర్‌ల నిర్వహణలో నేతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే అధిష్టానం మాత్రం పక్కాగా ఇలాంటి సమావేశాల ద్వారానే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని భావిస్తోంది.



ఆదిలాబాద్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ (ఫైల్)

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం..

ప్రజాగోస–బీజేపీ భరోసాలో భాగంగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శక్తి కేంద్రాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ప్రధానంగా కేంద్రం నిధులను వినియోగించుకుంటున్న రాష్ట్రం ప్రజలకు మాత్రం తామే అంతా చేస్తున్నామన్న భ్రమ కల్పిస్తుంది. దీనిపై ప్రజలకు వివరిస్తున్నాం. అలాగే పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, ఫసల్ బీమా తిరిగి కొనసాగింపు, ఇల్లు లేని వారికి గూడు కల్పించడం వంటి పథకాలపై వివరిస్తున్నాం.

– పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



పిల్లలను దీవిస్తున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులను పూజిస్తూ..



తల్లిదండ్రులకు హారతినిస్తున్న విద్యార్థులు

అమ్మా..నాన్న దీవించండి

జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో మాతృ, పితృ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోగల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్, ప్రగతి విద్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంగళహారతులతో తల్లిదండ్రులను పూజించారు. వారి చుట్టూ ప్రదక్షిణలు చేసి దీవెనలు అందుకున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. – ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

నార్నూర్: మండల కేంద్రంలో గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేంకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన రాథోడ్ అజయ్, రాథోడ్ శివతో పాటు మరో ఇద్దరు మైనర్లను గంజాయితో సహా పట్టుకుటున్నట్లు తెలిపారు. వారి నుంచి 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


లభ్యమైన మృతదేహం

భైంసా: బాసర గోదావరి రెండో ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

తాంసి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వామన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేస్రం సుదర్శన్–నీలాబాయి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు శ్రీనివాస్(22) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై కేశవ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్


కోచ్ రాజుతో సపావత్ రమ్య

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి సపావత్ రమ్య మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న రెండో ఖేలో ఇండియా జాతీయ మహిళల పోటీల్లో జూడో క్రీడలో స్వర్ణ పతకం సాధించింది. డీవైఎస్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి, కోచ్ రాజు అభినందించారు.

ఎస్సైని గాయపరిచిన యువకుడి అరెస్ట్


పోలీసుల అదుపులో యువకుడు

ఆదిలాబాద్ టౌన్: ఎస్సైని గాయపర్చిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో సోమవారం రాత్రి ఎస్సై కలీం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన సద్దాం అనే యువకుడు ఎస్సైని నెట్టివేయగా గాయాలపాలయ్యారు. మద్యం మత్తులో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతోనే ఎస్సైకి గాయాలైనట్లు తెలిపారు. ఈ మేరకు యువకుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

- వరుణ్‌రెడ్డి బదిలీతో ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టు ఖాళీ
- ప్రచారంలో వరుణ్‌రెడ్డి సతీమణి పేరు
- మరో కీలక అధికారి సైతం జోరుగా పైరవీ?


ఐటీడీఏ కార్యాలయం

ఉట్నూర్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా ఎవరు వస్తారోననే ఉత్కంఠ ఏజెన్సీలో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా నియమించిన విషయం విధితమే. ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగా ఎవరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జిగా వరుణ్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పీవోగా వరుణ్‌రెడ్డి సతీమణి, కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వస్తారని ప్రచారం ఉంది. అలాగే ఐటీడీఏలో కీలక పోస్టులో కొనసాగుతున్న ఓ అధికారి సైతం ప్రాజెక్టు అధికారిగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు సమాచారం.

ఐటీడీఏనే కీలకం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఉట్నూర్ ఐటీడీఏనే కేంద్ర స్థానం. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 38 మండలాలు ఉన్నాయి. ఇందులో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలు పూర్తిస్థాయి ఏజెన్సీ మండలాలు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.95 లక్షల ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతోంది. అయితే కొంతకాలంగా ఐటీడీఏకు పీవోగా వస్తున్న అధికారులు కనీసం రెండేళ్లు గడవకుండానే బదిలీపై వెళ్తుండడంతో పాలన గాడి తప్పుతుందనే ఆరోపణలున్నాయి.

ఇద్దరిలో ఎవరో..?

ఓవైపు వరుణ్‌రెడ్డి సతీమణి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ప్రభుత్వం పీవోగా నియమిస్తుందని కొద్ది రోజులుగా ఏజెన్సీలో ప్రచారం సాగుతుంది. మరోవైపు ఐటీడీఏలో కొద్ది నెలల క్రితం కీలక బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి సైతం పీవోగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. సదరు అధికారికి ఉమ్మడి జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యే అండదండలున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సదరు అధికారికి చెందిన ఫైల్ ప్రభుత్వ పెద్దల వద్ద ఉందని, వారం పది రోజుల్లో ఉత్తర్వులు కూడా వెలువడుతాయని ఐటీడీఏలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఇద్దరిలో ఎవరికైనా పీవోగా బాధ్యతలు అప్పగిస్తుందా.. లేక కొత్తవారిని తీసుకువస్తుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

వరుణ్‌రెడ్డి బదిలీతో...

ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం గతేడాది జూన్ 13న నియమించింది. అయితే జనవరి 31న ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనను నిర్మల్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏకు కొత్త పీవోగా ఎవరినీ నియమించకపోవడంతో వరుణ్‌రెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలూ అప్పగించింది. ఓవైపు కలెక్టర్‌గా, మరోవైపు పీవోగా ఇన్‌చార్జి బాధ్యతల నేపథ్యంలో ఐటీడీఏ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆదివాసీ, గిరిజన నాయకులు అంటున్నారు. పూర్తిస్థాయి పీవోను త్వరగా నియమించాలని వారు కోరుతున్నారు.

జెడ్పీ సమావేశానికి డుమ్మా




జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన జెడ్పీ సమావేశానికి పలువురు సభ్యులు, అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో ప్రజా సమస్యలు చర్చించే సమావేశ మందిరంలో కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి మూడు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవ్వాలి. కానీ జిల్లాలోని 18 మండలాలకు గాను 13మంది జెడ్పీటీసీలు, ఆరుగురు ఎంపీపీలు మాత్రమే హాజరయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, కొందరు అధికారులు కూడా రాలేదు. దీంతో కొత్త కలెక్టర్ వరుణ్‌రెడ్డి.. ఇక నుంచి జరిగే సమావేశాలకు ప్రతి అధికారి హాజరుకావాలని సమావేశంలోనే హెచ్చరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

టెంట్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై, తహసీల్దార్

నిర్మల్ రూరల్: మండలంలోని కొండాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి టెంట్‌హౌస్, లైట్ హౌస్ గోదాం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాపురం పోశెట్టి టెంట్‌హౌస్ నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన రమణ డీజే లైట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ఓ గోదాం తీసుకొని అందులో సామగ్రి నిల్వ చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గోదాంలో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. రూరల్ తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. రూ.7 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఉన్న ఓ బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం దుకాణంలోని విద్యుత్ మీటర్ నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పేశారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రమాదం జరిగిన బేకరీని పరిశీలించారు.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు


బూరుగుపల్లి(కే) గ్రామంలో ఓ ఇంటిపై తెగిపడిన 11 కేవీ వైర్లు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం పలువురి ఇళ్లపై హైటెన్షన్(11కేవీ) విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వెంటనే గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో కూడా రెండుసార్లు 11 కేవీ తీగలు తెగిపడ్డాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇళ్ల పైనుంచి 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయిని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరంతా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి 11 కేవీ తీగలను ఇళ్ల పైనుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని బాలుడి అప్పగింత


బాలుడితో సీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

భైంసాటౌన్: బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని బాలుడిని ఐసీడీఎస్ అధికారులు పట్టణంలోని వివేకానంద ఆవాసంలో అప్పగించారు. కుభీర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ అనసూయ మంగళవారం భైంసా నుంచి నిర్మల్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. తిరిగి భైంసాకు వస్తున్న క్రమంలో ఓ బాలుడు కనిపించడంతో చిరునామా కోసం ఆరా తీసింది. బాలుడు వివరాలు తెలుపకపోవడంతో భైంసాలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో నాగలక్ష్మి దృష్టికి తీసుకురాగా, వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలుడి వివరాలు నమోదు చేయించారు. అనంతరం స్థానిక వివేకానంద ఆవాసంలో అప్పగించారు. బాలుడి కుటుంబీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.

మేక పిల్లలను చంపిన గుర్తుతెలియని వ్యక్తి


మృతిచెందిన మేక పిల్లలు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన జంగు రమేశ్‌కు చెందిన ఏడు మేక పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చంపేశారని ఎస్సై విక్రమ్ తెలిపారు. రమేశ్ రోజులాగే మేక పిల్లలను గ్రామ సమీపంలో ఉన్న పశువుల కొట్టంలో ఉంచాడు. రాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు 7 మేక పిల్లలను చంపేశారు. మంగళవారం ఉదయం మేక పిల్లలు చనిపోయి ఉండడంతో కావాలనే చంపారన్న అనుమానంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఊరకుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు మృతి


మృతిచెందిన పొట్టేలును చూపుతున్న బాధితురాలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామంలో ఊరకుక్కలు దాడిలో రెండు గొర్రె పొట్టేళ్లు మృతిచెందాయి. గ్రామంలోని ఊరుమెట్ల భీమయ్యకు చెందిన రెండు పొట్టేళ్లు ఇంటి వద్ద కట్టేసి ఉంచగా, ఊర కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఈ ఘటనతో తనకు రూ.20 వేలకుపైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం చెల్లించేలా చూడాలని కోరాడు.

పొట్టేలు అపహరణ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల రాములు విలువైన చోరీ అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి ఏడాది క్రితం రూ.30 వేలకుపైగా వెచ్చించి పొట్టేలును కొనుగోలు చేసి తెచ్చాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు కొట్టంలోని మంద నుంచి ఆ పొట్టేలును ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పొట్టేలు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. 2017లోనూ తమ కొట్టంలోని ఆరు మేకలు చోరీ అయ్యాయిని తెలిపాడు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశానని అయినా దొంగలను పట్టుకోలేదని వెల్లడించాడు. ఇప్పటికైనా పోలీసులు విచారణ చేసి దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరాడు.

ధన్నూర్‌లో దొంగల అలజడి

బోథ్: మండలంలోని ధన్నూర్ బీ గ్రామంలో దొంగలు అలజడి సృష్టించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. సోమవారం రాత్రి రెండు ఇళ్ల తలుపులు పగులగొట్టినట్లు తెలిపారు. కాగా, గ్రామస్తులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీందర్ సూచించారు.

పుల్వామా అమరులకు నివాళి



జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలనీలో పుల్వామా అమరవీరులకు మంగళవారం రాత్రి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో జోహార్లు అర్పించారు. – నిర్మల్‌టౌన్

కమనీయం శివపార్వతుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలోని పురాతన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. బాబాపూర్, నర్సాపూర్, వడ్యాల్, రాచాపూర్, కంజర్ గ్రామాల నుంచి భక్తులు కల్యాణం తిలకించేందుకు వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర పర్సన్ విజయలక్ష్మి, ఎంపీటీసీ గణేశ్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీవిద్య, ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న రైతు

తాంసి: తాంసి మండల కేంద్రానికి చెందిన ఓ రైతు నిజాయతీని చాటుకున్నాడు. పంట చేన్లకు వెళ్లే క్రమంలో రోడ్డుపై దొరికిన స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశాడు. భీంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వహించే అశోక్ మంగళవారం తాంసి గ్రామం మీదుగా విధులకు బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో తాంసి గ్రామ శివారులోని పంట చేన్ల సమీపంలో స్మార్ట్‌ఫోన్ పడిపోయింది. పంట చేనులోకి వెళ్తున్న రైతు వన్నెల రామన్నకు ఈ స్మార్ట్‌ఫోన్ దొరికింది. గ్రామస్తులకు ఫోన్ దొరికిన విషయం తెలియజేయగా వారు ఆరా తీశారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆర్‌ఐ అశోక్‌గా గుర్తించి గ్రామస్తుల సహకారంతో రైతు రామన్న అతడికి మొబైల్ అందజేశాడు. నిజాయతీ చాటుకున్న రైతును గ్రామస్తులు అభినందించారు.

‘నంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్’

భైంసాటౌన్: వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని, లేనిపక్షంలో వాహనం సీజ్ చేస్తామని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


వాహనం తనిఖీ చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ప్రవీణ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ధర్మన్న (ఫైల్)

తానూరు: మండలంలోని హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎల్వి గ్రామానికి చెందిన జొరిగల్ ధర్మన్న(52) ద్విచక్రవాహనంపై ముథోల్ నుంచి ఎల్విక్ వెళ్తున్నాడు. హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ధర్మన్న వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడ్డారు. హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ధర్మన్నకు భార్య చంద్రకళ, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): తిర్యాణి మండలంలోని ఖైరిగూడ ఓసీపీ వెళ్లే దారిలో పావురాల గుట్ట సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చోపిడి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తిర్యాణి మండలం చోపిడి గ్రామానికి చెందిన టేకం మారుతి, టేకం భీంరావు సొంత పని నిమిత్తం గోలేటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పావురాలగుట్ట సమీపంలోకి రాగానే ఖైరిగూడ వైపు నుంచి గోలేటి వైపు వెళ్తున్న జేసీబీ ఎదురుగా ఆటోను ఢీకొట్టింది. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ మారుతి తలకు, వెనుక కూర్చున్న భీంరావ్ ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందితోపాటు రెబ్బెన ఎస్సై భూమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ శవంత, పైలెట్ సంతోష్ హుటాహుటిన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

హింగోలి ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


ఎంపీ హేమంత్ పటేల్‌తో బాసర బీఆర్‌ఎస్ నాయకులు

భైంసా: మహారాష్ట్రలోని హింగోలి ఎంపీ హేమంతపటేల్‌ను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. అక్కడి హోటల్‌లో ఎంపీని కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ప్రణాళికలపై చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావ్, మండలాధ్యక్షుడు జిడ్డు మల్లయ్యయాదవ్, నాయకులు రాజు దేశాయ్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్

భైంసాటౌన్: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. భైంసాలోని రెండు కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ చేస్తూ విద్యార్థులు పట్టుబడినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి ప్రకటించారు. బీఏ/బీఎల్, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ, వొకేషనల్ మొదటి సెమిస్టర్ పరీక్షలు అలాగే ఎంఎస్సీ(పీజీ) మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 19 మంది, జీపీఎల్ డిగ్రీ కళాశాలలో 07 మంది మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇతర 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్ హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 20న తొమ్మిది ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. తుడుందెబ్బ నాయకులు గేడం భరత్, తోడసం సాగర్, సోయం మురహరి, మెస్రం వామన్‌రావ్, మెస్రం జైరాం తదితరులున్నారు.

మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆవిష్కరించారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు సల్మాన్, అనంతరావు, రాధాబాయి, కమల, కళ్యాణ్ గోవింద్, రాజు, ఆనంద్‌రావు, శ్రీను, దుబ్బన్న, ఎల్లమ్మ, స్వప్న తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న గోడం నగేశ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రాజా దేవుష కుమారుడు సీతాగోండి ఆత్రం సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గోడం నగేశ్ మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు, ఎంపీపీ పంద్ర జైత్‌రావు, నాగోబా దేవస్థానం చైర్మన్ మెస్రం తుకారాం, మర్సుకోల తిరుపతి తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ర్యాలీ తీస్తున్న సిబ్బంది, విద్యార్థులు

తాంసి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చని భీంపూర్ ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్‌బంద్, గిరిగాం గ్రామాల్లో ఆరోగ్యమేళాలో భాగంగా విద్యార్థులతో వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నులిపురుగులు, క్యాన్సర్ నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచులు కృష్ణ, యశ్వంత్, సూపర్‌వైజర్ గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలున్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి విరాళాలు



విరాళం అందిస్తున్న పర్ధాన్ సమాజ్ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్..

జైనథ్: 'ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. మండలంలోని పర్ధాన్ సమాజ్ మండల కమిటీ సభ్యులు ఆకోలి గ్రామానికి చెందిన నైతం బాబారావ్‌కు రూ.7,500 విరాళం అందించారు. పర్ధాన్ సమాజ్ మండలాధ్యక్షుడు గంగ్రప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామస్తులు మరో రూ.30వేలు అందించినట్లు తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా మరో రూ.12వేలు దాతలు అందించారని పేర్కొన్నారు. నాయకులు సిడాం రాకేశ్, విఠల్, సత్యనారాయణ, సునీల్, గణేశ్ పాల్గొన్నారు.

పుల్వామా వీరజవాన్లకు నివాళి



ఆదిలాబాద్: కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న నాయకులు

- ర్యాలీ తీసిన వివిధ సంఘాలు
- సేవలను కొనియాడిన నాయకులు

ఆదిలాబాద్: పుల్వామా సైనిక అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గల అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గేడం మహదేవ్, కోశాధికారి సుర్యకాంత్, మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్‌దాస్, కెప్టెన్ మజార్, నాయకులు దశరథ్ పటేల్, శర్మాజీ, వామన్‌రెడ్డి, కిషన్, శ్రీనివాస్, సతీశ్, మహిపాల్, రాకేశ్ బారాడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఐపీ స్టేడియంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

బోథ్: మండల కేంద్రంతోపాటు సొనాల గ్రామంలో పుల్వామా దాడిలో మృతి చెందిన జవానులకు గ్రామస్తులు కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పించారు. సొనాల గ్రామ వివేకానంద పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గంగాధర్, మాసం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ మాసం, వెంకటేశ్, సూర్యం, నిఖిల్, సాయికిరణ్, సాయిరోహిత్, రాజశేఖర్, సాయి, సిద్ధు, ప్రవీణ్, బలరామకృష్ణ, నితీశ్‌గౌడ్, ప్రకాశ్, సిద్ధు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: పుల్వామా దాడిలో అమర సైనికులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్ నుంచి కలెక్టరేట్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్ మీదుగా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గల అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, మహేశ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



బోథ్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఏజెన్సీలో గంజాయిపై ప్రత్యేక నిఘా

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నార్నూర్, గాదిగూడ మండలాల పరిస్థితిని సీఐ ప్రేంకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో కొందరు గంజాయి మోజులో పడ్డారని, వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గిరిజనులతో పోలీసుల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఐ ఇమ్రాన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్

'రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ఎండగట్టాలి'

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ప్రజల్లో ఎండగట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజుయాదవ్ సూచించారు. మండలంలోని దేగామ శక్తి కేంద్రంలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు బత్తిని సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుయాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బోథ్ అసెంబ్లీ ప్రభారి కొంగ సత్యనారాయణ, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, సూర్యకాంత్‌గిత్తే, ఆడేమానజీ, భీంరెడ్డి, శేఖర్, పోరెడ్డి శ్రీనివాస్, గాజుల నరేశ్, శ్రీకాంత్, నరేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నార్నూర్: గాదిగూడ మండలం డాబా(బీ) గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో అన్మోల్ జీవన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీపీ అడ చంద్రకళ రాజేశ్వర్ విద్యార్థులకు చదువు సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిరుపేద ఆదివాసీ గిరిజన విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోయం హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు మెస్రం రామారావు, నాయకుడు కొటంబె డిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



పోలీసుల అదుపులో నిందితుడు

గుడిహత్నూర్: 'గుప్పు మంటున్న గుడుంబా' శీర్షికన గత శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందిస్తున్నారు. గత శనివారం ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఐదు లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేశారు. మంగళవారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వడ్డెర కాలనీలో దాడులు నిర్వహించగా శివరాం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. శివరాంకు గుడుంబా సరఫరా చేసిన నేరడిగొండతండాకు చెందిన ఆడే గణేశ్‌ను అదుపులోకి తీసుకుని నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.

సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: బంజారా రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్మించిన సేవాలాల్ మహరాజ్ పాటల సీడీని మంగళవారం ఆవిష్కరించారు. బంజారా రచాయితల వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఇందల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి ధరంసింగ్ జాదవ్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని కవి కోకిల బంకట్‌లాల్, చౌహాన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా వీడియో గ్రాఫర్ రాథోడ్ శ్రీకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాథోడ్ శేషరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఇచ్చోడ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్‌ఐవో రవీందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా, సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా కళాశాలలో విద్యార్థులను ప్రోత్సహించడానికి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ గణేశ్, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బేల: మండలకేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్స్‌లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా, సాంస్కృతిక వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, ఎస్సై కృష్ణకుమార్ మండల ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పుల్వామా దాడిలో మరణించిన వీర సైనికుల ఆత్మకు శాంతి కలగాలని నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఇంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సతీశ్ పవార్, ప్రమోద్‌రెడ్డి, వడ్కర్ తేజ్‌రావు, కోడే విపిన్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దశరథ్

నేరడిగొండ: మండలంలోని యాపల్‌గుడ గ్రామంలో వాలీబాల్ పోటీలను గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ మంగళవారం ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు హీరాసింగ్, ప్రజాప్రతినిధులు, నాయకులు శంకర్, గంగారాం, కృష్ణ, పటేల్, భీంరావు, రాములు, రాఘవులు, లక్ష్మణ్, శేఖర్, సంతోష్, ప్రభాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని జిల్లా నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాద్రిలో కొనసాగుతున్న హాథ్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలిశారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. జోడో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ఆడే గజేందర్, సంతోష్, కోటేశ్వర్, నగేశ్, భీమన్న, శంషొద్దీన్, నారాయణరెడ్డి తదితరులున్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

సంక్షిప్త వార్తలు

దిష్టిబొమ్మ దహనం

బోథ్: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసిన 'హమారా ప్రసాద్' దిష్టిబొమ్మను మండలంలోని సొనాల గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రమేశ్, పాటిల్ అమృత్‌రావ్, సంగపాల్, ప్రభాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులకు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మణి మంగళవారం అవగాహన కల్పించారు. రోగుల వద్దకు వెళ్లి అందుతున్న సేవలపై ఆరా తీశారు. సకాలంలో డయాలసిస్ చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

తలమడుగు: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ లాటెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ సుందర్, గంగన్న, వినోద్‌రెడ్డి, అజయ్‌కుమార్, రమాకాంత్, మహేశ్‌కుమార్ తదితరులున్నారు.

గోశాల నిర్వాహకుల ఎంపికలో అన్యాయం

కైలాస్‌నగర్: మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించిన గోశాల నిర్వహణ కోసం అనర్హులను ఎంపిక చేసి అర్హులైన ఎన్జీవోలకు అన్యాయం చేశారని న్యూరెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు భగవాండ్లు, రాము ఆరోపించారు. సోమవారం మున్సిపల్ డీఈకి దీనిపై ఫిర్యాదు చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా అనర్హులను ఎంపిక చేశారని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చించేనా?

తాంసి: ఆరేళ్ల క్రితం ఏర్పడిన భీంపూర్ మండలం అభివృద్ధికి నోచుకోవడంలేదు. టికీ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. మండల వ్యాప్తంగా అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత సమావేశాల్లో సమస్యలపై సరైన చర్చ జరపకుండానే ముగించారు. నేడు మండల కేంద్రంలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలోనైనా ప్రజాప్రతినిధులు సమస్యలు లేవనెత్తాలని, అధికారులు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'దాడి హేయమైన చర్య'

బోథ్: ఇచ్చోడ విలేకరి ఖమర్‌పై కొంతమంది దాడి చేయడం హేయమైన చర్య అని బోథ్ ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. విలేకరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆహ్లాదం కోసమే పార్కుల నిర్మాణం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- జయశంకర్ మెమోరియల్ పార్క్ ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకే పార్కుల నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. పట్టణంలోని తాటిగూడ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ మెమోరియల్ పార్కును మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్యక్రాంతం అవుతున్న మున్సిపల్ ఖాళీ స్థలాలను గుర్తించి పార్కుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సీసీఐ పునఃప్రారంభంపై బీజేపీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభించేవరకూ ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాదినాటికి అండర్‌బ్రిడ్జి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, క్రీడా మైదానాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. భాగ్యనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ చౌక్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కౌన్సిలర్లు బండారి సతీశ్, అశోక్ స్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ, భాగ్యనగర్ తదితర కాలనీల్లో ఎమ్మెల్యే జోగు రామన్న పర్యటించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, అశోక్ స్వామి, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, భూమన్న, గణేశ్, లక్ష్మణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

ఇంద్రవెల్లి: అంబేద్కర్ మాతృమూర్తి భీమాబాయి, సతీమణి రమాబాయి, అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా వారి చిత్రపటాలతో మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ బుద్ధవిహార్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మహామాయ ఉపసికా సంఘ్, ధమ్మచక్ర యూత్ ఆధ్వర్యంలో మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, భీమాబాయి, రమాబాయి, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామూహిక బుద్ధ, ధమ్మ, సంఘ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పూజ్య బంతే ఆశ్వజిత్, మహామయ ఉపసికా సంఘం నాయకురాలు మాయాబాయి, శిలాబాయి, మాయావతి, ప్రభావతి, లతాబాయి, ఉషాబాయి, దృపత, కాంచన, పెద్దలు మస్కే రాజువర్ధన్, సునీల్, కాంరాజ్, గౌతం, లక్ష్మణ్, ఆనంద్, సాధు, ఉత్తం కాంబ్లే, రాందాస్, దయానంద్ తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బుద్ధ భక్తులు

పరిహారం అందించాలని ధర్నా

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో సాగు భూములు కోల్పోతున్న తమకు వెంటనే పరిహారం అందించాలని మంగళవారం రిజర్వాయర్ పనులు చేపడుతున్న ప్రాంతంలో పిప్పల్‌కోటి గ్రామ రైతులు ధర్నా చేశారు. భూసేకరణ చేపట్టి ఐదేళ్లవుతున్నా పరిహారం అందకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ఎకరాకు రూ.8లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వామి, ఉద్ధవ్, భూమన్న, లక్ష్మారెడ్డి, నర్సింగ్, నసీరుద్దీన్, విలాస్ రామన్న తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



భీంపూర్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ

తాంసి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ప్రభారి సత్యనారాయణ సూచించారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బీజేపీ శక్తి కేంద్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం చేపడుతున్న, చేపట్టాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు వివరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, ఉపాధ్యక్షులు సామ సంతోష్‌రెడ్డి, భీంరెడ్డి, మండలాధ్యక్షుడు రాకేశ్, జిల్లా అధికార ప్రతినిధి రామారావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రెడ్డి రమేశ్, అంకం అశోక్, నారాయణ, నవీన్ తదితరులున్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ రాథోడ్ సజన్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రంలో మండల వైద్యాధికారి సద్దాం, సర్పంచ్ సోలంకి గీత కరణ్‌సింగ్, వైద్య సిబ్బంది రాంనరేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాంసిలో ఎడారి ఓడలు



ఒంటెలను తీసుకెళ్తున్న రాజస్థాన్ వ్యక్తి

తాంసి: రాజస్థాన్‌కు చెందిన పశువుల కాపరులు పశుగ్రాసం కోసం ఏటా జిల్లాకు వస్తుంటారు. ఈ ఏడాది కూడా పలువురు తమ పశువులను తోలుకుని బతుకుదెరువు కోసం ఇక్కడకు వస్తున్నారు. పశువులతో పాటు ఒంటెలను తీసుకువచ్చారు. మంగళవారం మండల కేంద్రం మీదుగా రాజస్థానీలు ఒంటెలను తీసుకువెళ్తుండగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సుకు హాజరైన గ్రామస్తులు

నేరడిగొండ: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది, బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని లింగట్ల, చింతగూడ, నంద్యానాయక్ తండా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైన న్యాయ సహాయం కోసం తమను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు శంకర్‌ను శాలువాతో సన్మానించారు. గ్రామ పటేల్ పెందూర్ అశేరావు, పెందూర్ భీంరావ్, తుడుందెబ్బ బోథ్ మండల కార్యదర్శి దుర్వ విశ్వేశ్వర్‌రావ్, మాడవి ఆనందరావు, పవర్ వినేశ్, రాజు, శంబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ ఎంపీపీపై కేసు నమోదు చేయాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నేరడిగొండ: ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం లంబాడా ఆదివాసీ నాయకులు ఎస్సై సాయన్నకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. లంబాడాలు, ఆదివాసీలను ఎంపీపీ అసభ్య పదజాలంతో దూషించడం సరికాదని పేర్కొన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో లంబాడాలా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్, రాథోడ్ కమల్‌సింగ్, జంగ్, నగేశ్ తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మదర్స్ కేర్ హైస్కూల్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నైతిక విలువలు, విద్య ప్రాముఖ్యత అంశంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం షోయబ్ అల్తాఫ్, కరెస్పాండెంట్ అమీర్, ఉపాధ్యాయులున్నారు.